క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

కలిగిరి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్ కళాధర్‌రావు గురువారం తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.8.32 కోట్లతో 720 పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ పనులను పరిశీలించి సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై సభలో విచారణ జరపనున్నట్లు చెప్పారు. డ్వామా ఏపీడీ ఏ నిర్మలాదేవి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు.

11న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం నందవరంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పేట శ్రీనివాసులురెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పాఠశాలలో హాల్‌టికెట్లను ఆన్‌లైన్ లేదా పాఠశాలలో పొందాలని సూచించారు. 11న ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

కావలి రూరల్: మండలంలోని ఒట్టూరు ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎస్ ఇందిర గురువారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

డీసీపల్లిలో ముగిసిన పొగాకు వేలం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో 63 రోజుల పాటు కొనసాగిన అధికారిక పొగాకు కొనుగోళ్లు గురువారంతో ముగిశాయి. 2022–23 సంవత్సరానికి సంబంధించిన పొగాకు వేలం ఈ ఏడాది మార్చి 9న ప్రారంభమైంది. వేలంలో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. రైతుల నుంచి 60,65,385 కిలోల పొగాకును కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.212, కనిష్టంగా రూ.170, సగటున రూ.197.39 ధర పలికిందని వివరించారు. రైతులకు రూ.119.72 లక్షలను పొగాకు బోర్డు ద్వారా చెల్లించినట్లు తెలిపారు. పొగాకు బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా అదనపు కొనుగోళ్లకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రామాలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళం



ఉదయగిరి: గన్నేపల్లి పంచాయతీ మిట్టపల్లిలో చేపడుతున్న కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి వైఎస్‌ఎంపీపీ, జీఎంకే ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.50 వేలు విరాళాన్ని ప్రకటించారు. గురువారం ట్రస్టు కార్యాలయంలో ట్రస్ట్ ప్రతినిధి బుడంగుంట్ల వెంకటేశ్వర్లు ఆలయ నిర్మాణకర్త గడ్డం వెంకటేశ్వర్లుకు నగదు విరాళాన్ని అందజేశారు.


రెండు ట్యాంకర్ల ఢీ



ప్రమాదానికి కారణమైన ఆయిల్ ట్యాంకర్

సంగం : స్థానిక గురుకుల పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న సిమెంటు ట్యాంకర్‌ను వెనుక వైపుగా ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. అనంతరం కల్వర్టు గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ల డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

నూతన కమిటీ ఎన్నిక



ఉదయగిరి: గ్రామ సచివాలయాల్లో పనిచేసే వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏల అసోసియేషన్ ఉదయగిరి డివిజన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మేంద్ర అధ్యక్షతన జరిగిన అసోసియేషన్ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా హరనాథ్, జనరల్ సెక్రటరీగా దినేష్‌ను ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు చంద్రశేఖర్, వెంకటపతి, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

లాభదాయక వ్యవసాయమే లక్ష్యం



ఆత్మకూరులో మాట్లాడుతున్న డీడీఏ శివన్నారాయణ

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ ప్రోత్సాహకాలను రైతులకు అందించి వారితో లాభదాయక వ్యవసాయం చేయించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివన్నారాయణ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ సిబ్బందికి గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటల సాగు ఖర్చులు తగ్గించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సహాయకులు కీలకపాత్ర పోషించాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి, ఏఓ శైలజాకుమారి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ పొలంబడి మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది మెరుగైన పనితీరు కనబరచాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి వరిసాగులో కలుపు నివారణ పద్ధతులు, ఎరువులు, మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ, ఆత్మకూరు, అనంతసాగరం, అనుమసముద్రంపేట మండలాల ఏఓలు కిషోర్‌బాబు, శ్రీధర్‌రెడ్డి, రజని, ఎంపీఈఓలు, ఏఈఓ, వీఏఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను రైతులకు చేరువ చేయాలి

ఉదయగిరి: ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వారికి చేరువ చేసే బాధ్యత మనందరిపై ఉందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివన్నారాయణ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని వరికుంటపాడు, మర్రిపాడు, దుత్తలూరు, సీతారామపురం, ఉదయగిరి మండలాల వ్యవసాయ సిబ్బందికి గురువారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పొలంబడి, ఎరువులు యాజమాన్యం, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఏడీఏ లక్ష్మీమాధవి, వ్యవసాయ శాస్త్రవేత్తలు కిరణ్‌కుమార్, శైలజా, ఇన్‌చార్జి ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓలు సబ్బారెడ్డి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో అవగాహన కల్పిస్తున్న డీడీఏ

అర్థరహిత విమర్శలు మానుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు: కొందరు నాయకులు తమ ఉనికి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అర్థరహిత విమర్శలు చేస్తున్నారని, వాటిని వెంటనే మానుకోవాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి హితవుపలికారు. పట్టణంలోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఆత్మకూరు అభివృద్ధిపై విమర్శలు చేయడాన్ని ఖండించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ తరుపున గెలిచి వెన్నుపోటు పొడిచిన నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందుతుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం నాడు–నేడు, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో విద్యకు పెద్దపీట వేయడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో తన సొంత నిధులతో పలు గ్రామాల్లో రైతుల కోసం బోర్లు, పంట కాలువల్లో పూడికతీత పనులు చేయించారన్నారు. నారంపేట వద్ద ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేసి పరిశ్రమలను తీసుకొచ్చేందుకు కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరాన్ని ఏర్పాటు చేసి తన సొంత నిధులు రూ.3 కోట్లతో మున్సిపల్ బస్టాండ్ నిర్మించారన్నారు. ఏడీఎఫ్ ద్వారా రూ.10 కోట్ల నిధులు సేకరించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లు ఉండి చూడలేని వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబునాయుడి కాపీ మేనిఫెస్టోను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. గతంలో బాబు మాటలు నమ్మి మోసపోయి పడిన తీవ్ర ఇబ్బందులను మహిళలే గుర్తు చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులు ఎన్ని విమర్శలు చేసినా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీనే ప్రజలు ఆదరిస్తారన్నారు. జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, బట్టేపాడు సొసైటీ అధ్యక్షుడు వీ లక్ష్మీరెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సానా వేణుగోపాల్‌రెడ్డి, బోయలచిరివెళ్ల సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, వాశిలి గిరినాయుడు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు జనన ధ్రువీకరణలు



జనన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న అధికారులు

అల్లూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు ఐదేళ్లలోపు చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నామని కావలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీ కావలి శారద తెలిపారు. అల్లూరు ప్రభుత్వాస్పత్రిలో దాదాపు 25 మంది చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రాలు లేని చిన్నారులు ఆధార్ పొందలేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పర్యటించి జనన ధ్రువీకరణ పత్రాలు లేని ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి అందజేస్తున్నామని తెలిపారు. జనన ధ్రువీకరణలు ఉన్న పిల్లలకు ఆధార్ కార్డులను సులభంగా పొందవచ్చని చెప్పారు. ఆధార్ ఉంటే రేషన్, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకుని ఐదేళ్లలోపు పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలను పొందాలని కోరారు. ఎంపీడీఓ శ్రీదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



మర్రిపాడులో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు



ఏఎస్‌పేటలో హెచ్‌ఎం రాధయ్యకు సత్కారం

ఆత్మకూరు(అనుమసముద్రంపేట): ఏఎస్‌పేట గ్రంథాలయంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు విజ్ఞానదాయక అంశాలను బోధించడంతో పాటు పేపర్‌క్రాఫ్ట్, చిత్రలేఖనం, తదితర అంశాల్లో శిక్షణ ఇచినట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కొందరు విద్యార్థులకు విజ్ఞాన పుస్తకాలు అందజేశారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ ఇచ్చిన హిందూ పాఠశాల హెచ్‌ఎం రాధయ్యను లైబ్రేరియన్ శ్రీనివాసరాజు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మర్రిపాడు గ్రంథాలయంలో గురువారం విద్యార్థులు ఆటాపాటలతో ఉత్సాహంగా గడిపారు. క్యారమ్స్, స్కిప్పింగ్, బారాకట్ట, లెమన్‌స్పూన్, తదితర ఆటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి నారాయణరావు విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించి మెరుగైన వైద్యసేవలను అందించేలా కృషి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో కలెక్టర్ గురువారం సమీక్షించారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు, ఆరోగ్యశ్రీ, సుస్థిర అభివృద్ధి సూచీలు, తదితరాలపై సమీక్ష జరిపిన అనంతరం ఆయన మాట్లాడారు. మాతాశిశు మరణాలను తగ్గించాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, దీనికి అనుగుణంగా గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు చేసి అనీమియా రాకుండా చూడాలని చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా వైద్యపరీక్షల కోసం వచ్చిన వారిలో బీపీ, షుగర్, టీబీ, తదితర వ్యాధులను గుర్తించి వారి వివరాలను సంబంధిత యాప్‌లలో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. బాలింతలకు రిజిస్ట్రేషన్ దశ నుంచి చెకప్, డెలివరీ అయి వారు ఇంటికి చేరేంత వరకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సేవలు కచ్చితంగా అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్ర పరిధిలో ఇమ్యూనైజేషన్ నూరు శాతం అమలయ్యేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు: నర్రవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు, రేపు శిక్షణా తరగతులు

కలిగిరి: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు శుక్ర, శనివారాల్లో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఈ నెల 11న జరిగే ప్రవేశ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో భాగంగా రెండ్రోజుల పాటు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. శిక్షణా తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఐదో తరగతి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకం తీసుకురావాలని సూచించారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల వినతి



ఆత్మకూరు: వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. గురువారం వారు మున్సిపల్ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తుండడాన్ని గుర్తించి ఎంఈఓ షేక్ నజీర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఆయన కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బాలాజీ, యశ్వంత్, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి

ఆత్మకూరు: ఆత్మకూరు ఉపఖజానా కార్యాలయం పరిధిలోని పెన్షనర్లు ఈకేవైసీ వెంటనే చేయించుకోవాలని ఆ కార్యాలయ ఏపీఓ రవికుమార్ గురువారం తెలిపారు. ఉపఖజానా కార్యాలయం పరిధిలో 110 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని చెప్పారు. ఈకేవైసీకి తక్కువ సమయం ఉన్నందున రెండో శనివారం, ఆదివారం సైతం చేయించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

జలదంకి: వైఎస్సార్ పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జలదంకి పశువైద్యాధికారి ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. బీమా పథకం క్రింద సంకరజాతి ఆవులు, గేదెలు, ఎద్దు మృతి చెందితే రూ.30 వేలు, దేశవాళీ ఆవు, గేదెలు మృతి చెందితే రూ.15 వేలు, జీవాలు మృతి చెందితే రూ.6 వేలు చొప్పున నష్టపరిహారం అందజేస్తారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గేదెను ఢీకొన్న కారు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి బస్టాండ్ సెంటర్‌లో గురువారం రాత్రి రోడ్డు దాటుతున్న గేదెను నెల్లూరు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. గ్రామానికి చెందిన పాల్తి వెంకటసుబ్బయ్య గేదెలు పొలం నుంచి ఇంటికి వస్తూ రోడ్డు దాటుతుండగా కారు వేగంగా వచ్చి గేదెను ఢీకొంది. అనంతరం అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గేదె తీవ్రంగా గాయపడింది. జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో మర్రిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రమబద్ధీకరించి విచారణ చేపట్టారు.

వైఎస్సార్ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య



ధ్వంసం చేసిన విగ్రహాన్ని పరిశీలిస్తున్న మెట్టుకూరు

వరికుంటపాడు: దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్యని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఖండించారు. మండలంలోని గొల్లపల్లి ఎస్టీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు బుధవారం ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని మెట్టుకూరు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసి వారి గుండెల్లో స్థానం సంపాదించుకున్న రాజకీయ నేతలకే విగ్రహాలను ఏర్పాటు చేస్తారన్నారు. అలాంటి మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం సరికాదన్నారు. ఇలాంటి దుశ్చర్యలు సమాజంపై చెడు ప్రభావం చూపుతాయని, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తన సొంత నిధులతో ధ్వంసమైన విగ్రహ స్థానంలో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత గంగవరపు పుల్లయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి కార్యకర్తలు మరమ్మతులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంబ్రా బాలగురువారెడ్డి, నాయకులు గుంటుపల్లి నాగభూషణం, బత్తుల నరసింహం, చాకలకొండ రమణయ్య, తదితరులు ఉన్నారు.

ఆహార భద్రత చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న రమణయ్య

ఉదయగిరి: ఆహార భద్రత చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫుడ్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య పేర్కొన్నారు. ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫుడ్స్ స్వచ్ఛంద సంస్థ, ఏపీ వలంటరీ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శకునాలపల్లి సచివాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ నీటితో పండే జొన్న, రాగి, సజ్జ, కొర్ర, మినుము, మొక్కజొన్న, తదితర పంటలను రైతులు పండించడం ద్వారా ఆహార భద్రత వర్ధిల్లుతుందన్నారు. సేంద్రియ ఎరువులతో పంటలను పండించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు అనూష, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు



ఆత్మకూరు రూరల్: బొటికర్లపాడులో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్



సంగం: వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సంగం: కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సుల ద్వారా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. మండలంలోని అన్నారెడ్డిపాళెం సచివాలయంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారంపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం ఏడు అర్జీలు అందగా పరిష్కారంపై రెవెన్యూ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ నెల 28 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మర్రిపాడు మండలం భీమవరం, ఆత్మకూరు మండలం బొటికర్లపాడులో తహసీల్దార్లు ఆనందరావు, లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి రెవెన్యూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆత్మకూరు, మర్రిపాడు ఆర్‌ఐలు పృథ్వీకుమార్, సురేంద్ర, స్థానిక వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండల మినగల్లు సచివాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్ ఆధ్వర్యంలో రెవెన్యూ సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అసైన్‌మెంట్ పట్టా, భూ విస్తీర్ణం తక్కువగా ఉందని, తదితర సమస్యలపై అర్జీలు అందగా వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న రేవూరు 13న ఆమని చిరువెళ్ల,14న ఇనగలూరు, బెడుసుపల్లి, లింగంగుంటలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

ముగిసిన అడవి పేరంటాలమ్మ ఉత్సవాలు



బండను లాగుతున్న ఎడ్లు

ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో ఐదు రోజులుగా జరుగుతున్న అడవి పేరంటాలమ్మ ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. గన్నేపల్లి పంచాయతీతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తమ వాహనాలను ప్రత్యేకంగా అలంకరించుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

కోలాహలంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

అడవి పేరంటాలమ్మ ఉత్సవాల్లో సందర్భంగా ఎడ్ల బండ లాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వైఎస్సార్ జిల్లా గుంతపల్లికి చెందిన మేడేపల్లి వెంకటసుబ్బయ్య ఎడ్లు 1097 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అదే జిల్లా గోపవరానికి చెందిన నెమలయ్య ఎడ్లు 1035 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు పోటీల నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

డ్రిప్ ఇరిగేషన్ పరిశీలన



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసులు

చేజర్ల: మండలంలోని ఎస్వీ కండ్రిక, గాలిపాళెం గ్రామాల్లో నిమ్మ తోటల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బీ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. డ్రిప్ పైపుల నాణ్యతను తనిఖీ చేశారు. డ్రిప్ ప్రయోజనాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు(అనుమసముద్రంపేట): ఏఎస్‌పేట మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారిగా (ఏఓ) సీహెచ్ శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరులో ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఏఓగా బదిలీపై వచ్చారు. ఎంపీడీఓ భాస్కర్‌ను కలిసి బాధ్యతలు చేపట్టారు. ఏఓకు ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

వివాదంపై కేసు నమోదు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లిలో గురువారం ఇద్దరు యువకుల నడుమ చోటు చేసుకున్న వివాదానికి సంబంధించి వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విశ్వనాథరెడ్డి తెలిపారు. వివరాలు..డీసీపల్లిలో గోసుల సురేష్ మీసేవ కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఆయన భార్య మహాలక్ష్మి మీసేవ కేంద్రంలో ఉండగా సమీప బంధువైన తవ్వా వెంకటేశ్వర్లు మద్యం మత్తులో వచ్చి దుర్భాషలాడసాగాడు. ఈ విషయం తెలుసుకున్న సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని అడ్డుకోబోగా వెంకటేశ్వర్లు పాత ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విషయాలను ప్రస్తావిస్తూ విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోదండరాముడికి అశ్వ వాహనం బహూకరణ



కొండాపురం: మండలంలోని కొమ్మి గ్రామంలోని రామాలయానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నం వెంకట సుబ్బయ్య రూ.60 వేల విలువైన ఇత్తడి అశ్వ వాహనాన్ని గురువారం బహూకరించారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద అశ్వ వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా రామాలయం వద్దకు తీసుకెళ్లి బహూకరించారు. కాగా శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాములకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అశ్వ వాహనోత్సవం నిర్వహించారు.